ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

5

మంగళవారం 18 ఫిబ్రవరి 2025



జగన్ పాలనలో సమస్యల పరిష్కారం ఒక ప్రయాసే. నాడు అడుగడుగునా రాజకీయ జోక్యం.. జీ హుజూరు అంటూ రెవెన్యూ, పోలీసు అధికారుల భజనలతో సాగింది. దీంతో బీదాసాదకు భూ సమస్యలు పరిష్కారం కావడం, పోలీసు స్టేషన్లలో న్యాయం జరగడం గగనమైందనే విమర్శలు ఉండేవి. చివరకు సమస్యలను గ్రీవెన్స్‌లో విన్నవించినా స్పందన అంతంత మాత్రమే. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చీ రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇన్నాళ్లు ప్రజలు పడిన ఇబ్బందులను, కుప్పలు తెప్పలుగా వస్తున్న ఫిర్యాదులను చక్కదిద్దేందుకు సిద్ధమయ్యారు. గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకు మండల, జిల్లా స్థాయిలో వారం వారం జరిగే గ్రీవెన్స్‌లల్లో వచ్చే ఫిర్యాదులు సహా ప్రత్యేక రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించాల్సిందే అంటూ కలెక్టర్లు, ఎస్పీలు, మంత్రులకూ గట్టిగా హెచ్చరికలు చేశారు. మంత్రులకు సమస్యల పరిష్కారంలో ర్యాంకులు వేయడంతో ఇప్పుడు తమ పనితీరును నిరూపించుకునేందుకు వారు మరింత కసరత్తు చేస్తున్నారు.



పరిష్కారమే అజెండా..

- సమస్యల పరిష్కారం కోసం చంద్రబాబు చర్యలు
- గ్రీవెన్స్, రెవెన్యూ సదస్సుల్లో 17,953 ఫిర్యాదులు
- అందులో భూ సమస్యలు 9,643
- రెండు, మూడు స్థానాల్లో సర్వే, పోలీసు శాఖలు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల నుంచి గత జూన్ నుంచి 17,953 వరకు ఫిర్యాదులు అందాయి. అందులో మూడొంతులకు పైగా సమస్యలు రెవెన్యూలోనే ఉన్నాయి. దీంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో పాటు జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్ కుమార్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. కూటమి సర్కారు ప్రజలతో మమేకమై ఉండే రెవెన్యూ, పోలీసు శాఖల తో పాటు మిగతా 52 శాఖల్లో పేరుకు పోయిన దాదాపు 18వేల సమస్యల ఫైళ్లకు దుమ్ము దులిపే పనిలో పడ్డారు. జిల్లాలో కలెక్టర్, జేసీలు కలియ తిరుగుతూ రెవెన్యూలో క్షేత్ర స్థాయిలో అధికారుల పనితీరును అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది దుమ్ము దులుపుతున్నారు. సమస్యల పరిష్కారంపై పట్టు సాధించేలా ఇప్పటికే నాలుగు రెవెన్యూ డివిజన్ల సిబ్బందికి హెచ్చరికలు జారీ చేయడంతో రెవెన్యూలో ఉరుకులు పరుగులు మొదలయ్యాయి. అర్జీల పరిష్కారం నామమాత్రంగా సాగుతోందా? లేక అధికారులు గ్రామ స్థాయిలో ప్రజల వద్దకెళ్లి పరిష్కరిస్తున్నారా? అనే విషయాలపై ఆడిట్ విభాగం తప్పొప్పులను లెక్కించి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు, నోడల్ అధికారి, జడ్పీ సీఈఓ ఓబులమ్మకు నివేదించే పనిలో నిమగ్నమైంది.

మూడొంతుల సమస్యలు రెవెన్యూలోనే..

కూటమి సర్కారు వచ్చీ రాగానే ప్రజల సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు సమర్పించే బాధితుల సంఖ్య పెరిగింది. అందులో ప్రస్తుత కలెక్టర్ శ్రీధర్ గ్రీవెన్స్‌లో అర్జీదారుని తన ఎదురుగా కూర్చోబెట్టుకొని సమస్యలు తెలుసుకోవడం, నేరుగా సమస్యలు పరిష్కరించేందుకు గట్టిగా అధికారులకు వార్నింగ్ ఇవ్వడం చేస్తున్నారు. అలాగే సమస్యల పరిష్కారంపై అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో జిల్లాలో సమస్యలు గాడిలో పడుతున్నట్లు అధికారులు, ప్రజలు చెప్పుకుంటున్నారు. 8 నెలల కూటమి సర్కారు పాలనలో జిల్లాలో అన్ని శాఖల నుంచి 17,953 ఫిర్యాదులు రాగా అందులో అధిక సమస్యలతో రెవెన్యూ ప్రథమ స్థానంలో నిలిచింది. ఫిర్యాదుల్లో అన్నీ భూ వివాదాలే. భూకబ్జాలు, మ్యుటేషన్లు, వెబ్‌ల్యాండ్, ఆన్‌లైన్, రెవెన్యూ రికార్డుల్లో తప్పుల ఎంట్రీలు ఇలా 9,643 ఫిర్యాదులు వచ్చాయి. ఇవన్నీ గత ప్రభుత్వంలో జరిగిన నిర్వాకమని రెవెన్యూ అధికారులు అంటున్నారు. వాటిలో ఇప్పటివరకు 5,783 ఫిర్యాదులు పరిష్కరించారు. 3,865 పరిష్కార దశలో ఉన్నాయి.

తరువాత స్థానాల్లో సర్వే, పోలీసు శాఖలు

ప్రజా ఫిర్యాదుల్లో రెవెన్యూ సమస్యలు అగ్రభాగం కాగా తర్వాతి స్థానాల్లో సర్వే, పోలీసు శాఖలు నిలిచాయి.. జగన్ హయాంలో జిల్లాలో 285 గ్రామాల్లో దాదాపు 4 ఏళ్లపాటు 4.44లక్షల ఎకరాల్లో సాగిన రీసర్వే వివాదాస్పదమనే చెప్పాలి. రీసర్వేలో భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు, గతంలో ఉన్న భూ హద్దులు చెరగడం, అన్నదమ్ముల భాగ పరిష్కారాలు (ఎల్‌పీఎం), పాస్ బుక్కుల్లో రైతుల పేర్ల స్థానంలో ఇతరుల పేర్లు చేర్చడం, చివరికి భూమికి సరిహద్దుల రాళ్లకు కూడా జగన్ బొమ్మ ముద్రించడం.. ఇలా లెక్కలేనన్ని తప్పులతో రైతులు విసిగిపోయారు. అప్పట్లో ఈ శాఖకు దాదాపు 4,400 పైగా రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఆ సమస్యలను ఇప్పుడు అధికారులు చక్కదిద్దే పనిలో పడ్డారు. ఇప్పటి వరకు 1,280 అర్జీలు పరిష్కారం కాగా.. మిగిలినవి పరిష్కార దశల్లో ఉన్నాయి.

ఇక పోలీసు కేసుల విషయానికి వస్తే.. గత ప్రభుత్వంలో పేదలు న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ మెట్లెక్కినా ప్రయోజనం ఉండేది కాదు. ఎందుకంటే నాటి అధికారుల్లో కొందరు రాజకీయ రంగు పులుముకోవడంతో సామాన్యుడికి పోలీసు న్యాయం దొరకడం కష్టమైంది. అప్పట్లో న్యాయం కోసం ఎదురు చూసిన వారే కూటమి సర్కారులో న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ మెట్లెక్కారు. అయితే దాదాపు 1,174 కేసుల్లో 1,078 కేసులను పోలీసు శాఖ పరిష్కరించడం విశేషం. మిగిలిన 96 సమస్యలను పరిష్కరించే దిశలో ఉంది.

మున్సిపల్ శాఖల్లో 954 ఫిర్యాదులు తాగునీరు, పారిశుధ్యం, కాల్వలు తదితరాలకు రాగా అందులో అందులో 869 పరిష్కరించారు. 85 పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీ రాజ్ శాఖలో 296 ఫిర్యాదుల్లో 253 పూర్తి చేయగా 43 పెండింగ్‌లో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖలో 190 ఫిర్యాదుల్లో 178 పరిష్కారం కాగా 12 పెండింగ్‌లో ఉన్నాయి. విద్యుత్ శాఖలో 1000కి పైగా విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్స్ ఫిర్యాదులు, మిగతా శాఖల్లో 50 నుంచి 100 లోగా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదికలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను విన్నవించారు. కలెక్టర్ అర్జీలు స్వీకరించిన మీదట వారి సాధక, బాధలు తెలుసుకుంటూ అర్జీలను పరిశీలించి తదుపరి చర్యల కోసం అధికారులకు సిపారసు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాది దారు విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో అధికారులు స్వయంగా పరిశీలించి పారదర్శకంగా విచారించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోగా పరిష్కరించాలన్నారు.

కమలాపురం మండలం చదిపిరాళ్లకు చెందిన ఓబులేశు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ తాను కిడ్నీ, గుండె జబ్బుతో బాధపడుతున్నానని తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. సింహాద్రిపురం మండలం, బిదినంచెర్లకు చెందిన నారమ్మ అర్జీ సమర్పిస్తూ తనకు 726/1 సర్వే నెంబరులో తన 4.55 ఎకరాల భూమి ఇపుడు ఫ్రీహోల్డ్ కానుండడంతో కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వీఎన్‌పల్లి మండలం కీర్తిపల్లికి చెందిన రామలింగారెడ్డి తన భూమి బెంగళూరు-విజయవాడ రోడ్డు విస్తరణలో పోయిందని నష్టపరిహారం వచ్చేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఎస్డీసీ వెంకటపతి, శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

మస్టర్లలో మాయాజాలం

- పనులకు రాకుండానే హాజరు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
- జేబులు నింపుకుంటున్న కిందిస్థాయి ఉద్యోగులు



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నగర, పుర పాలికల్లో కొందరు పారిశుధ్య కార్మికులు విధులకు రాకున్నా హాజరు వేయించుకుంటూ జీతాలు తీసుకుంటున్నారు. కార్మికుల స్థానంలో బినామీలు ఎక్కువయ్యారు. రూ.వేలకు వేలు వేతనాలు పొందుతున్న కొందరు వారి స్థానంలో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తున్నారు. కొందరు కార్మికులు అయితే వారికి బదులు వేరే వారిని నియమించకపోవడంతో మిగిలిన కార్మికులపై పనిభారం పడుతోంది. అక్రమాలను బయటకు చెబితే వేధింపులు అధికమవుతాయనే భయంతో పనులు చేసే కార్మికులు మిన్నకుండిపోతున్నారు.

పనులకు రాకుండా..

పారిశుధ్య కార్మికులకు మస్టర్లతో పాటు ఎఫ్ఆర్ఎస్ హాజరువేస్తారు. క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు కార్మికుల నుంచి ముడుపులు తీసుకొని లాగిన్ ఇచ్చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వారే స్వయంగా హాజరు వేసుకొని పనులకు రాకుండా డుమ్మా కొడుతున్నారు. కొందరు పీహెచ్ వర్కర్లుగా జీతాలు తీసుకుంటూ అసలు ఎక్కడ పనిచేస్తున్నారో ఎవరికి తెలియకపోవడం గమనార్హం. ప్రజాప్రతినిధుల కార్యాలయాల్లో కాలం గడిపేస్తున్నారు. ఇలా కడప నగరపాలక సంస్థలో వందల సంఖ్యలో ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. ఒక్కో పొరుగు సేవల ఉద్యోగికి రూ.21 వేలు ఇస్తున్నారు. విధులకు రాకుండా జీతాలు తీసుకుంటున్న వారు నెలకు కొంత మొత్తం పారశుధ్య విభాగంలోని కొందరు అధికారులకు ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పారిశుధ్య కార్మికుల వివరాలు

జిల్లాలో మొత్తం పారిశుధ్య కార్మికులు దాదాపు 3800 వరకు ఉన్నారు. వీరిలో ఔట్‌సోర్సింగ్‌కు సంబంధించి 3250, రెగ్యులర్ 550 మంది విధులు నిర్వహిస్తున్నారు. కడప కార్పొరేషన్ పరిధిలో దాదాపు 1204 మంది పనిచేస్తున్నారు. వీరిలో 1094 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది కాగా, మిగతా 110 మంది రెగ్యులర్ విధులను నిర్వహిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

పారిశుధ్య కార్మికులు ఉదయం 5.30 గంటలకు మస్టరు వేసి పది గంటల వరకు విధుల్లో ఉండాలి. రెండో విడతలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలి. పారిశుధ్య డివిజన్ పర్యవేక్షణకు శానిటరీ ఇన్‌స్పెక్టరు, మేస్త్రీలు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శి ఉంటారు. ప్రతి డివిజన్‌లో శాశ్వత, ఆప్కాస్ కార్మికులను నియమిస్తారు. వారిలో కొందరు మస్టరు వేయించుకొని ఇళ్లకు వెళ్లిపోతారు. ఆప్కాస్ కార్మికుల్లో మేస్త్రీల బంధుమిత్రులు గట్టుమీద పెత్తందారులుగా వ్యవహరిస్తారు. ఇలాంటి వ్యవహారాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని ప్రధాన రహదారులు, ఉన్నతాధికారులు పర్యటించే ప్రాంతాలకు కేటాయిస్తారు.



అవకతవకలు జరిగితే చర్యలు తప్పవు

పారిశుధ్య కార్మికుల మస్టర్లకు సంబంధించి ఎటువంటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవు. ప్రతిరోజూ మస్టర్లను పరిశీలించడం జరుగుతుంది. తమ దృష్టికి ఏమైనా అవకతవకలు ఉన్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. అలాగే ఒకరికి బదులుగా మరొకరు పనిచేసే విషయంలో ఏమైనా కారణాలుంటే ఎంహెచ్‌ఓ అప్రూవల్ తీసుకొన్న వారికి మాత్రమే అనుమతిస్తాం. అది కూడా రోజుల్లో మాత్రమే.

- మనోజ్‌రెడ్డి, కమిషనర్

బాధితులకు సత్వరం న్యాయం చేయాలి : ఎస్పీ

కడప క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి న్యాయం చేయాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాది దారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు విన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులకు ఫోను ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా.. తన బైక్ నెంబరుతో అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నియోజకవర్గం సెట్టూరులో మరొకరు తిరుగుతున్నారని అసలైన వాహనదారుడు దేవనేని వెంకటరమణ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సెట్టూరులో అతను ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ తిరుగుతుండడంతో ఆర్‌సీ ప్రకారం తన సెల్‌కు చలానాలు వస్తున్నాయని ఎస్పీకి దృష్టికి తెచ్చారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించండి


హోంగార్డులు విధుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ సూచించారు. జిల్లాలోని హోంగార్డు సిబ్బందికి రెండు వారాల పాటు నిర్వహించే మొబిలైజేషన్ కార్యక్రమాన్ని ఎస్పీ సోమవారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మొబిలైజేషన్‌లో ట్రాఫిక్ రెగ్యులేషన్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఫిజికల్ ఫిట్‌నెస్, మాబ్ కంట్రోల్, బందోబస్తు విధులు, డ్రిల్ తదితర అంశాల్లో తర్ఫీదు ఇస్తారన్నారు. హోంగార్డు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రమం తప్పకుండా యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం దృఢంగా అవుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్ బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు శ్రీశైలరెడ్డి, ఆనంద్, వీరేశ్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

నిలువునా ఎండిపోతున్నాయి

- వింతవ్యాధి బారిన చీనీచెట్లు



మహదేవపల్లెలో నిలువునా ఎండిపోతున్న చీనీచెట్లు

చక్రాయపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చీనీచెట్లు వింత వ్యాధి బారినపడుతున్నాయి. పచ్చగా ఉన్న చెట్లు ఉన్నఫళంగా వాడుమొగం పెట్టి ఎండిపోతున్నాయి. నీళ్లు పుష్కలంగా ఉండటంతో బాగా ఏపుగా పెరిగి పచ్చగా కళకళలాడుతూ మంచి కాయలతో ఉన్న చీనీచెట్లు కళ్లముందే ఎండిపోతుంటే చూడలేక రైతులు మనోవేదనకు గురవుతున్నారు. చక్రాయపేట మండలంలోని మహదేవపల్లె గ్రామం తాటిగుట్ల శివప్రసాద్‌రెడ్డికి చెందిన వంద చీనీచెట్లు కాయదశలో నిలువునా ఎండిపోతున్నాయి. ఈ చెట్లు ఎండిపోవడానికి కారణం ఏంటని అధికారులు కూడా తేల్చలేకపోతున్నారు. ఈ వింతవ్యాధితో చెట్టు నిండా ఉన్న కాయలు ఒకటి రెండురోజుల్లోనే రాలిపోతున్నాయి. కాయలు కోతదశకు వచ్చిన సమయంలో ఇలా ఎండిపోవడంతో దిక్కుతోచడం లేదని రైతు వాపోతున్నారు. ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఖజానాలో సిబ్బంది ఖాళీ

- విధులకు ఒకరు, ఇద్దరు మాత్రమే హాజరు
- బిల్లులు ఆన్‌లైన్‌లో చేస్తున్నామంటున్నారు
- ఇదీ జిల్లా ఖజానా కార్యాలయం తీరు



రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న వివిధ శాఖలకు పద్దుల రూపంలో డబ్బులు చెల్లించే జిల్లా ఖజానా కార్యాలయంలో సిబ్బంది సమయానికి రాక కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ కార్యాలయంలోని కొంత మంది ఉద్యోగులు అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హార్టికల్చర్, అగ్రికల్చర్, డిస్ట్రిక్ ఇండస్ట్రియల్, రెవెన్యూ, హాస్టల్స్ వారికి బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. వేళపాళా లేకుండా ఇష్టానుసారం ఆఫీస్‌కు వచ్చి రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోతున్నారని తెలిసింది. దీంతో ఆఫీసులో సిబ్బంది లేక కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొంతమంది ఖజానా కార్యాలయ సిబ్బంది బిల్లులు ఆన్‌లైన్‌లో పంపించండి. మేము పూర్తి చేస్తామని కూడా సెలవిస్తున్నారని తెలిసింది. ఇక్కడ దాదాపు 18 మంది సిబ్బంది ఉండగా కేవలం నలుగురు మాత్రమే హాజరవుతున్నారని తెలుస్తోంది. ఈ ఆఫీసులో సమయానికి రాని సిబ్బందిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఆ సెక్షన్‌లో ఉన్న వాళ్లు సమయానికి రాలేదు కాబట్టి మేము కూడా సమయానికి రాలేదు అని ఒకరిపై మరొకరు చాడీలు చెప్పుకుంటున్నారు. ఇలా ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ ఆఫీసుకు సమయానికి రావడం లేదన్న వాదన ఉంది. ఏదైనా బిల్లు వస్తే కింది స్థాయి ఎస్టీవోకు ఫార్వర్డ్ చేయడం అది ఏమని అడిగితే మీరు చూసుకోండి అని సమాధానం ఇస్తున్నారని తెలిసింది. కొంతమంది ఆఫీస్‌కు రాకుండా బిల్లులు వాట్సాప్‌లో పెట్టండి అని విచిత్ర సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న ఏటీవో డిప్యూటేషన్‌పై రాజంపేటకు వెళ్లిపోయారు. ఆ సీటు ఖాళీగా దర్శనమిస్తోంది. అంతేగాకుండా ఇంత పెద్ద ఆఫీసుకు కనీసం ఒక అటెండర్ కూడా లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉందని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెప్పుకొస్తున్నారు. ఈ ఆఫీసులో పనిచేస్తున్న అటెండర్‌కు ప్రమోషన్ వచ్చి రాజంపేటకు వెళ్లిపోయింది. కనీసం ఇద్దరు అటెండర్లు ఉండాల్సినటువంటి ఈ కార్యాలయానికి ఒక్క అటెండర్‌ను కూడా భర్తీ చేయలేదు. ఇప్పటికైనా ఈ కార్యాలయంలో ఉన్న సిబ్బందిని సమయపాలన పాటించి ఉద్యోగానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతు న్నారు. ఈ విషయమై జిల్లా ఖజానాధికారి మహబూబ్‌ను వివరణ కోరగా తన కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఎవరూ సమయానికి రావడం లేదు. తన మాట ఎవరూ వినడం లేదని, అందుకే తాను లీవ్ పెట్టి వెళ్లిపోతున్నానని చెప్పడం గమనార్హం.

రాజంపేట మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

- విధుల్లో నిర్లక్ష్యం.. ప్రభుత్వ ఉత్తర్వులు ఖాతరు చేయకపోవడం
- మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ



సస్పెన్షన్‌కు గురైన కమిషనర్ నాగేశ్వరరావు

రాజంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్‌గా నాగేశ్వరరావు విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రధానంగా మున్సిపల్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాల పట్ల అలసత్వం వహించడం ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేశారని తెలిపారు. రాజంపేట మున్సిపాలిటీలో పారిశుధ్యం గురించి పట్టించుకోకపోవడం, క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో పట్టణంలో పారిశుధ్య సమస్య ఎక్కువైందని, దీంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి మున్సిపల్ కార్యాలయంలోని కొందరు అధికారులతో ఈ సస్పెన్షన్‌పై ఆరా తీయగా కమిషనర్ జాయిన్ అయినప్పటి నుంచి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది. ప్రధానంగా జనవరి 16న మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్రస్థాయిలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్లక్ష్యంగా మాట్లాడటం, ఉన్నతాధికారుల మాటలను బేఖాతరు చేస్తూ మాట్లాడిన మాటలకు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

ఫిర్యాదు చేయడానికి వెళితే దుర్భాషలాడాడు

6

- సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులుపై ఎస్పీకి ఫిర్యాదు

కరువులో రైతుకు ఆసరా 'పాడి'

- డెయిరీతో ఆర్థిక ఆదాయం
- కష్టపడితే ఫలితం ఉందంటున్న రైతు

సంబేపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం జూదంలా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో రైతులను పాడి పరిశ్రమ ఆదుకుంటోంది. రైతులు పంటలు సాగు చేయడం ప్రకృతి విపత్తులతో నష్టపోవడం సహజంగా జరుగుతోంది. దీంతో రైతు పాడి పరిశ్రమ వైపు దృష్టి సారించారు. ఒకప్పుడు ఇంటిలో ఒకటి, రెండు లోపు పాడి ఆవులు, గేదెలు పెంచేవారు. వీటితో కుటుంబ అవసరానికి సరిపడే పాలు, పెరుగు వచ్చేది. ప్రస్తుతం మార్కెట్‌లో పాల దిగుబడులకు మంచి గిరాకీ ఏర్పడడంతో రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ఈ తరుణంలో పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకుని పాలు అమ్ముతూ ప్రతి నెలా ఆర్థికంగా సంపాదించడం విశేషం. కరువు పరిస్థితుల నుంచి ప్రస్తుతం పాడి పరిశ్రమ రైతులను ఆదుకుంటోంది. ఇందుకు నిదర్శనం రైతు సహదేవరెడ్డి. ఊరు సంబేపల్లె మండలం ప్రకాశ్‌నగర్‌కాలనీ గుండ్రేవాండ్లపల్లె. 30 గేదెలను హరియాణా రాష్ట్ర జింద్ ప్రాంతం నుంచి తెచ్చారు. వీటిలో 20 నుంచి 25 పాడి గేదెలు పాలు ఇస్తున్నాయి. ప్రతిపూట 100 లీటర్ల చొప్పున రోజుకు రెండు పూటలా 200 లీటర్లు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఒక లీటర్ ధర 70 నుంచి 80 రూపాయలు ఉండడంతో నెలకు సుమారు నాలుగు లక్షల రూపాయలు ఆదాయం వస్తున్నట్లు చెబుతున్నాడు. దీంట్లో 50 శాతం ఖర్చు పోయినా కష్టపడితే మంచి ఆదాయం వస్తుందంటున్నారు రైతు.



హరియాణా నుంచి తెచ్చిన గేదెలు



గేదెల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు



పశుగ్రాసాన్ని ముక్కలుగా కోసే మిషన్

మేలు రకపు గేదెల ఎంపిక

రైతులు అధిక పాలు దిగుబడి ఇచ్చే పాడి గేదెలను ఎంపిక చేసుకోవాలి. ఒక్కో పూట గేదె ఎనిమిది నుంచి పది లీటర్ల పాల దిగుబడి వచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి. రైతు హర్యానా రాష్ట్రం జింద్ ప్రాంతంలో గేదెలను ఎంపిక చేసుకుని 30 గేదెలను కొనుగోలు చేశారు. వీటికోసం మూడు రేకుల షెడ్‌లను నిర్మించారు. ఒక్కొక్కటి సుమారు 7 లక్షల రూపాయలు ఖర్చు చేసి మూడు రేకుల షెడ్లు నిర్మించుకున్నట్లు తెలియజేశారు. గేదెను పట్టి లక్ష పది వేల నుంచి సరాసరి రూ.1.50 లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసినట్లు తెలిపారు. హర్యానా నుంచి రావడానికి 10 గేదెలకు సుమారు లక్షన్నర రూపాయలు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను భరించినట్లు తెలియజేశారు. రైతు ఆశించిన పాల దిగుబడి రాకపోతే నష్టాలు వస్తాయని తెలియజేశారు.

వ్యవసాయం గిట్టుబాటు కాలేదు

వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. పెట్టుబడులు పెరిగిపోయాయి. పంట దిగుబడులు సక్రమంగా రాలేదు. దీంతో పాడిని ఎంచుకున్న పాల దిగుబడితో మంచి ఆదాయం వస్తోంది. పలువురికి ఉపాధి కల్పించడం సంతోషంగా ఉంది. కష్టపడి పనిచేస్తే పాడి పరిశ్రమలో మంచి ఆదాయం పొందవచ్చు.

- సహదేవరెడ్డి, రైతు, గుండ్రేవాండ్లపల్లె

పశువులకు వినియోగించే దాణా రకాలు

పాల దిగుబడి పెరగాలంటే వాటికిచ్చే పశుగ్రాస గడ్డితో పాటు దాణాకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారు రైతు. ఈ గీతల కోసం పత్తి చెక్క, మొక్కజొన్న, పొట్టు అలసంద, గోధుమపిండి, గోధుమ పొట్టు రకాలతో పాటు అమెరికల్ బుల్లెట్ రకం గడ్డిని కూడా తెలిపారు. గేదెలకు సరిపడే గడ్డి వేస్తున్నట్లు రైతు తెలిపారు.



గేదెలకు వాడుతున్న దాణా



సాగులో ఉన్న అమెరికన్ బుల్లెట్ రకం గడ్డి

బినామీ పేరుతో పోలీసు అధికారి భూకబ్జా

- సబ్‌కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు



పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వారసత్వంగా తమకు వచ్చిన భూమిని ఓ పోలీసు అధికారి బినామి పేరుతో ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కురబలకోట మండలానికి చెందిన నరసింహులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. తమ తాతల నుంచి సంక్రమించిన భూమిని మదనపల్లెలో పనిచేసిన పోలీసు అధికారి బినామి పేరుతో ఆక్రమించి, బెదిరిస్తున్నాడని కురబలకోట మండలం ఎర్రబల్లి పంచాయతీ కంటేవారిపల్లెకు చెందిన రైతు నరసింహులు ఫిర్యాదు చేశాడు. తమ పొలాలకు దారి లేకుండా ఓ మాజీ ప్రజాప్రతినిధి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మదనపల్లె మండలం పొన్నేటిపాలెం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ ఆముదాలకాలువ గ్రామంలో బోరు ఎండిపోయిందని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు విన్నవించారు. ఇలా డివిజన్‌లోని 11 మండలాల నుంచి 48 మంది సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందించగా, ఆయా మండలాల అధికారులు సకాలంలో సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు



ముద్దాయి షేక్ ఇలియాజ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళలపై కిరోసిన్ పోసి నిప్పంటించడానికి ప్రయత్నించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ సోమవారం రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన తీర్పు ఇచ్చారు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని కొత్తపల్లె మహబూబ్ నగర్‌కు చెందిన షేక్ ఇలియాజ్ 2022 జూన్ 1వ తేదీ రాత్రి 9.30 గంటలకు ఇంటి బయట కూర్చుని ఉన్న మహబూబ్‌జాన్ అనే మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నిస్తుండగా, ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకున్నారు. దీంతో నిందితుడు పారిపోగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు రాయచోటి అర్బన్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితుడికి పై మేరకు శిక్ష విధిస్తూ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన తీర్పు ఇచ్చారు.

మద్యం విక్రేత అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన రామయ్య, మద్యం సీసాలు

సిద్దవటం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీ నిర్మలగిరి కాలనీలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో కుంభగిరి రామయ్య(50) ఇంట్లోని ఓ బ్యాగులో 10 మద్యం సీసాలు పట్టుబడడంతో, స్వాధీనం చేసుకుని, అనతిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. స్థానిక పోలీసులు శివప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేయడానికి వెళితే దుర్భాషలాడాడు

- సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులుపై ఎస్పీకి ఫిర్యాదు



మీడియా ఎదుట కన్నీటి పర్యంతమవుతూ తన గోడును విన్నవిస్తున్న బాధితురాలు చంద్రకళ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ స్థలంలో పునాది వేస్తుంటే కొంత మంది రౌడీలు దౌర్జన్యం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయడానికి సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు దగ్గరకు వెళితే ముందు బయటకు వెళ్లండి లేకుంటే బూటుకాళ్లతో తంతానంటూ దుర్భాషలాడాడని సుండుపల్లె మండలం రాయవరం గ్రామం మిట్టమీదపల్లెకు చెందిన రామాంజులు భార్య మడితాడు చంద్రకళ సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు ఎస్పీ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ తమ సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాది వేస్తుంటే రాయవరం కస్పాకు చెందిన రౌడీలు భద్రి రమేశ్, మడితాడు బాబు, పవన్‌కుమార్, సాయికుమార్, ప్రవీణ్‌లతో పాటు మరో ముగ్గురు వచ్చి దౌర్జన్యం చేయడమే కాకుండా దాడికి ప్రయత్నించారని తెలిపారు. ఈ విషయంపై సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఎస్ఐ శ్రీనివాసులు మా దగ్గరకి ఎందుకు వచ్చారు. నేను ముందే చెప్పాను కదా వాళ్లు చంపేస్తారని, నువ్వు పోలీస్‌స్టేషన్ నుంచి బయటికి వెళ్లిపో లేదంటే బూటుకాళ్లతో తంతాను అని దుర్భాషలాడడమే కాకుండా ఫిర్యాదు తీసుకోకపోవడంతో చంద్రకళ రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌కు ఫిర్యాదు చేసేందుకు రాయచోటికి వెళుతుండగా రాయచోటి రోడ్డు మార్గంలో అనుంపల్లి సమీపంలో ఆ రౌడీలు భద్రి, ప్రవీణ్ మరికొంత మందిని మా వెంట పడడమే కాకుండా ద్విచక్ర వాహనంలో వస్తున్న మమ్మల్ని చేజింగ్ చేసి గొడ్డళ్లు, రాళ్లతో వెంటబడి హత్యా ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. నాకు ఆ రౌడీల నుంచి ప్రాణహాని ఉందని, న్యాయం చేయాలంటూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశామని మడితాడు చంద్రకళ తెలియజేశారు.

మా భూమిని మాకు ఇప్పించండి!

- 26 సెంట్లు కొనుగోలు చేసి 26 ఎకరాలు ఆక్రమించుకున్నారు
- రికార్డులు లేకుండానే వారికి పాసుబుక్కులు ఇచ్చేశారు
- రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా రెవెన్యూ అధికారులు
- పీలేరులో అర్చకుడు ఆనంద శర్మ ఆరోపణ



వివరాలు తెలుపుతున్న అర్చకుడు ఆనంద శర్మ

పీలేరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎటువంటి విక్రయ దస్తావేజులు లేకుండానే కొంత మంది ఆక్రమణదారులు తమ పూర్వీకుల ఆస్తిని కాజేశారని, వారి చెరలో ఉన్న తమ భూమిని తమకు తిరిగి ఇప్పించాలని పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ శివరామాపురానికి చెందిన అర్చకులు ఆనంద శర్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీలేరులో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తన తాత అయిన గర్నిపూడి రామయ్యకు దొడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో 26 ఎకరాల భూమి ఉండేదన్నారు. 1926లో అప్పటి చిత్తూరు జిల్లా బోర్డు సభ్యుడు అయిన ఊసు పాపిరెడ్డి విజ్ఞప్తి మేరకు పీలేరు-మదనపల్లె మార్గంలోని బడబళ్లవంకపై వంతెన నిర్మించేందుకు 26 సెంట్ల భూమిని విక్రయించారన్నారు. అయితే తదనంతర కాలంలో ఊసు పాపిరెడ్డి వారసులు ఆ 26 సెంట్లను ఏకంగా 26 ఎకరాలుగా మార్చి, నకిలీ దస్తావేజులు సృష్టించి తమ భూములను ఆక్రమించుకున్నారన్నారు. వాటిపై 2014 నుంచి 2022 సంవత్సరాల కాలంలో పలుదఫాలుగా వారికి పాసుపుస్తకాలను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారన్నారు. ఆక్రమణదారుల వద్ద ఎటువంటి కొనుగోలు దస్తావేజులు లేకపోయినా నోషనల్ ఖాతాల ద్వారా పాసుపుస్తకాలు అందజేశారన్నారు. నోషనల్ ఖాతాల ద్వారా పాసుపుస్తకాలు మంజూరు చేయరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. సుదీర్ఘ పోరాటం చేసినప్పటికీ లాభం లేకపోవడంతో తాను మదనపల్లెలో జరిగిన రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకు వినతి పత్రం అందజేశానన్నారు. అంతే కాకుండా ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లోనూ వినతి పత్రం అందించానన్నారు. ఆ వినతి పత్రం విచారణ కోసం పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారన్నారు. ఆయన రికార్డులు పరిశీలించకుండానే భూమి ఎవరి అనుభవంలో ఉంటే వారికే చెందుతుందని సమాధానం చెప్పారని వాపోయారు. పేద బ్రాహ్మణులైన తాము స్థానికంగా జీవనాధారం లేకపోవడంతో అర్చకత్వం వృత్తిగా స్వీకరించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జీవనం సాగించామన్నారు. ఆ భూములను గతంలో తాము పలుమార్లు కౌలుకు ఇద్దామని ప్రయత్నించినప్పటికీ ఆక్రమణదారులు అడ్డుకున్నారన్నారు. ఆ విషయాలన్నింటినీ తాను తహసీల్దారుకు విన్నవించినా ఆయన పట్టించుకోలేదన్నారు. తన వినతి పత్రంపై విచారణను వీలైనంత త్వరగా ముగించేయాలన్న తొందరలో ఉన్నారన్నారు. తనకు న్యాయం చేయాలని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయాలని, న్యాయం జరగని పక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రెవెన్యూ ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామన్నారు.

జీవోలను అమలు చేయండి

- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్



రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మినిట్స్ కాపీలో ఇచ్చిన జీవోలను వెంటనే అమలు చేయాలంటూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాయచోటి ప్రాజెక్టు కార్యదర్శి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు ధర్నా చేశారు. రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టులోని అధికారులు సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. దిగువరాజుగారిపల్లె హెల్పర్ రెండేళ్ల నుంచి విధులకు రాకపోయినా ఆమె పైన చర్యలు తీసుకోకపోవడానికి అధికారులకు ఆ హెల్పర్స్‌కు మధ్య ఉన్న మతలబు ఏంటని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బంగారుపాప, యూనియన్ లీడర్లు అరుణ, విజయ, షబీనా, సుమలత, సురేశ, పద్మజ, శంకరమ్మ, పద్మజ, జయమ్మ, లక్ష్మీదేవి, షబాణా, శైలజ, అంజలి, శ్రీదేవి, కళ తదితర వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తబస్సులు ప్రారంభం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):మదనపల్లె వన్ డిపోకు చెందిన కొత్తబస్సులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిపోలకు 25 నూతన బస్సులు రానున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. మదనపల్లె వన్ డిపో నుంచి బళ్లారి, హైదరాబాదు, తిరుపతి టూడిపో నుంచి విజయవాడ, తిరుపతిలకు కొత్తబస్సులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంలు మూరే వెంకటరమనారెడ్డి, అమరన్నాథ్, ఆర్టీసీ యూనియన్ నాయకులు, టీడీపీ నాయకులు గుత్తికొండ త్యాగరాజ, జేసీబీ మధు, గురునాథ్, జాన్‌బాబు, జేసీబీ వేణు, మోహన, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సిద్దవటం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పొట్టేళ్ల కొనుగోలు చేసి, డబ్బు ఇవ్వకుండా మోసం చేసిన ఇద్దరిపై సిద్దవటం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కాజిపల్లెకు భాస్కర్‌రెడ్డికి చెందిన 7 పొట్టేళ్లను గత ఏడాది జూలైలో కడప నగరానికి చెందిన సుబ్బారెడ్డి, బాషా రూ. లక్ష రూపాయలకు కొనుగోలు చేశారు. పది రోజుల్లో డబ్బు చెల్లిస్తామని చెప్పి మోసం చేశారంటే ఫిబ్రవరి 12న కడప ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేసిన పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రసాద్

నందలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు బస్టాండు కూడలిలో సోమవారం సాయంత్రం బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. మాధవరం నుంచి తాళ్లపాకకు బైకుపై వెళుతున్న కమ్మినేని ప్రసాద్, శ్రీకళ దంపతులను కడప నుంచి రాజంపేటకు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన దంపతులను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కడప జిల్లాకు రానున్న 20 సూత్రాల చైర్మన్ రాక

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర 20వ సూత్రాల చైర్మన్ లంక దినకర్ ఈనెల 18వతేదీ మంగళవారం కడపకు రానున్నారు. 17వ తేదీ రాత్రి 8-05 గంటలకు విజయవాడ నుంచి రైలులో బయలుదేరి 18న ఉదయం 7-30 గంటలకు కడప స్టేట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 10-30 గంటల నుంచి కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా రివ్యూ మీటింగ్‌ను 2 గంటల వరకు నిర్వహిస్తారు. అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహిస్తారు. సాయంత్రం 5-30 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రికి శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి చేరుకుని అక్కడే బస చేస్తారు.

రూ.10కోట్ల స్థలంలో పార్కు



నిరుపయోగంగా ఉన్న వైఎస్ఆర్ పార్కు



చెట్టు కింద బండలను పగలగొట్టిన దృశ్యం



పార్కులో పడేసిన మద్యం బాటిళ్లు

- అలనా పాలనలేక నిరుపయోగం
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పట్టణ నడిబొడ్డున దాదాపు రూ.10కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన పార్కు ఆలనా పాలన లేక నిరుపయోగంగా మారింది. గతంలో ఈ పార్కు ప్రాంతంలో ఆర్అండ్‌బీ అతిథి గృహం ఉండేది. దివంగత మంత్రి వీరారెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ఈ అతిథి గృహాన్ని అప్పట్లో అధికారులకు, మంత్రులకు విడిదిల్లుగా ఉపయోగించేవారు. అలాగే ప్రభుత్వ బహిరంగసభలకు, డ్వాక్రా మహిళల సమావేశాలకు ఉపయోకరంగా ఉండేది. కాలక్రమంలో అతిథిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో గత వైసీపీ ప్రభుత్వం లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చొరవ తీసుకుని వైఎస్ఆర్ పార్కును ఏర్పాటు చేశారు.

పోరుమామిళ్ల పట్టణ ప్రజలకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండే విధంగా సుమారు రూ.25లక్షల వ్యయంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్కు నిర్మించారు. అప్పట్లో పట్టణవాసులు తమ కుటుంబ సభ్యులతో ఇక్కడ సేదదీరేవారు. చిన్నారుల కోసం జారుడుబండ, ఉయ్యాల ఏర్పాటు చేశారు. అటువంటి పార్కు నిర్వహణ లేని కారణంగా అధ్వానంగా తయారై నేడు మందుబాబులకు నిలయంగా మారింది. పార్కులో ఎక్కడ పడితే అక్కడ మందుబాబులు తాగి పడేసిన మద్యం బాటిళ్ల దర్శన మిస్తున్నాయి. ఇక పార్కులో చెట్ల చుట్టూ సేదదీరేందుకు గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసిన అరుగులను ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఎవరైనా జోక్యం చేసుకుని మందలిస్తే వారిపై ఎదురు తిరిగిన సంఘటనలు ఉన్నాయి. రూ.కోట్లు విలువైన ఈ స్థలంలో ప్రజల కోసం పార్కు ఏర్పాటు చేస్తే అది ఇప్పుడు నిరుపయోగంగా మారింది. దీనిపై దృష్టి పెట్టకపోతే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే అవకాశాలున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాయకులు చొరవ తీసుకుని పార్కును పునరుద్ధ రించి అందరికీ ఉపయోగపడే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పోరుమామిళ్ల పంచాయతీ అధికారి రవిశంకరరెడ్డిని వివరణ కోరగా... ఆ పార్కును ఇంత వరకు ఎవరూ తమకు స్వాధీనం చేయలేదన్నారు.

శ్మశానం ఉన్నా ఇళ్ల మధ్యనే శవాన్ని పూడ్చివేయడం దారుణం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



ఇళ్ల మధ్యలో శవాన్ని పూడ్చివేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట గ్రామస్థులకు శ్మశాన వాటిక ఉన్నా పేదల గుడిసెల మధ్యనే శవాన్ని పూడ్చివేయడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. సోమవారం భాకరాపేట సమీపంలోని సీపీఐ కాలనీలో ఆదివారం భాకరాపేట గ్రామస్థులు శవాన్ని పూడ్చివేసిన స్థలాన్ని, కాలనీకి సమీపంలో ఉన్న భాకరాపేట శ్మశాన వాటికను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శ్మశాన వాటికలకు ఎప్పుడూ తమ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. అయితే భాకరాపేట గ్రామస్థులను కొందరు భూ ఆక్రమణదారులు రెచ్చగొట్టి తమ స్వలాభం కోసం పేదల కాలనీలో ఇళ్ల మధ్యనే శవాన్ని పూడ్చిపెట్టేందుకు వచ్చారన్నారు. ఇందుకు సీపీఐ నాయకులు నిర్మాణాలున్న చోట కాకుండా కాస్త దూరంలో అంత్యక్రియలు జరపాలని అభ్యర్థించినా వారు మాట వినలేదని.. ఇందులో భూఆక్రమ ణదారుల కుట్ర ఉందన్నారు. భాకరాపేట గ్రామస్థులను ప్రేరేపించిన భూ ఆక్రమణదారుల బాగోతం త్వరలోనే సీపీఐ బయటపెట్టి తగిన గుణపాఠం చెబుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, బాలు, డీహెచ్‌పీఎస్ నాయకులు పడిగ వెంకట్రమణ, సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి





ప్రమాద స్థలిలో సుబ్బయ్య మృతదేహం, సుబ్బయ్య (ఫైల్)

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి జాతీయ రహదారి గొల్లపల్లె గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కంబాల సుబ్బయ్య (45) మృతి చెందినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. దేవునికడపకు చెందిన కంబాల సుబ్బయ్య తాడిపత్రి ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున కడప నుంచి ఎర్రగుంట్ల వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గొల్లపల్లె సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శిరీషా, ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ తరలించి... కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

చెన్నూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రభారతిపేటలో మంగపట్నం మధుసూదన్ (43) అనే వ్యక్తి సోమవారం ఉదయం ఉరి వేసుకుని మృతి చెందాడు. కార్పెంటరుగా పనిచేసి జీవనం సాగించే మధుసూదన్ తల్లి వెంకట సుబ్బమ్మ ఆదివారం మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతునికి మానసిక వికలాంగుడైన ఓ అన్న ఉన్నాడని, తమ్ముని మరణంతో అతడు అనాథగా మిగిలాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మధుసూదన్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విషద్రావణం తాగి వ్యక్తి మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరుకు చెందిన శీలం సుబ్బరాయుడు అనే వ్యక్తి విషద్రావణం తాగి మృతి చెందాడు. సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. సుబ్బరాయుడు తన మొదటి భార్య కుమార్తె పుష్పలతను ప్రొద్దుటూరు ఖాదర్‌బాద్‌కు చెందిన కురాక్ వెంకటసుబ్బయ్యకు ఇచ్చి వివాహం జరిపించాడు. వారికి ఒక కుమార్తె సంతానం. అయితే గత కొంత కాలంగా పుష్పలత వేరే వ్యక్తితో చనువుగా ఉంటూ అతనితో కలిసి వెళ్లిపోయింది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేసినప్పటికి ఆమె అతనితోనే ఉంటానని చెప్పడంతో పరువు పోతుందని భావించి కలత చెందాడు. దీంతో జీవితంపై విరక్తితో ఆదివారం రాత్రి విషద్రావణం తాగాడు. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలోని రిమ్స్ పీఎస్ పరిధిలో నాగముని (45) అనే మహిళ సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. నాగముని తన తండ్రి ప్రసాద్ వద్ద ఉంటూ టిఫిన్ సెంటరు పెట్టుకుని జీవనం సాగించేవారు. అయితే తన తల్లి చిన్న చిన్న సమస్యలకు కూడా మానసికంగా బాధపడేదని.. ఈ నేప థ్యం లో క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుమారుడు దీపక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిరుతపులివి కాదు.. కుక్క జాతి జంతువు అడుగులు

- ముద్దనూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వెల్లడి



రైతులతో మాట్లాడుతున్న డీఆర్ఓ శ్రీనివాసులు

లింగాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): లింగాలలో ఆదివారం వాసుదేవరెడ్డి పొలంలో గమనించిన అడుగులు చిరుతపులివి కాదని ముద్దనూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన లింగాలలోని వాసుదేవరెడ్డి పొలంలోని అడుగులను పరిశీలించారు. ఇవి కుక్కజాతి జంతువు అడుగులని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. కానీ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనంతరం లింగాల తహసీల్దార్ ఈశ్వరయ్యను కలిసి సంఘటనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అలాగే అడవి జంతువుల నుంచి ఏ విధంగా రక్షించుకోవాలో తెలియజేసే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ గోపాలకృష్ణ, మహబూబ్ బాష పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- గోడ పత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ శ్రీధర్



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, విద్యుత్ అధికారులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో విద్యుత్ ప్రమాదాలను అరికట్టడంలో సూచనలపై వీడియో, ఆడియో, పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేబుల్ నెట్ వర్క్ టీవీల ద్వారా, ప్రొజెక్టర్ల ద్వారా విద్యుత్ భద్రత నియమాలపై వీడియో ప్రదర్శిస్తే అర్థం చేసుకోవడానికి సులభంగా ఉంటుందన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచగలిగితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఇంటికీ విధిగా ఎర్తింగ్ ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలను, ముఖ్యంగా వ్యవసాయ బోర్ల వద్ద భద్రత నియమాలు విధిగా పాటించాలన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన విద్యుత్ ప్రమాదాలు తీవ్ర దుఃఖాన్ని కలిగించాయన్నారు. ప్రాణం చాలా విలువైనదని... ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబసభ్యులు పడే వేదన, ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపతాయన్నారు. విద్యుత్ భద్రతా నియమాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీసీఈఓ ఓబుల మ్మ, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీరు రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మధుసూదన్, హుస్సేన్ బాషా, మధుసూదన్‌రెడ్డి, నీరజ, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలి

- గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతులు
- రోడ్డుపై బైఠాయించి నిరసన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు జాతీయ రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అనంతరం రోడ్డు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వివరాలిలా.. మండలంలోని మల్లేపల్లె గ్రామానికి చెందిన రైతులు బెంగుళూరు-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్నారు. దాదాపు 130 ఎకరాలకు 150 మంది రైతుల వద్ద నుంచి ప్రభుత్వ వాల్యు యేషను ప్రకారం ఎకరాకు రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని ఒప్పంద పత్రాలు తీసుకున్నారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూములతో జీవనం సాగిస్తున్నామని... ఈ భూములను కోల్పోతే తమకు ప్రత్యామ్నాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారుల పనుల జరిగే ప్రాంతంలో రైతన్నలు ఆందోళనకు దిగారు. ఉదయం 7గంటల నుంచి పనులు జరగకుండా వాహనాలను అడ్డగించి రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేపల్లె గ్రామ సర్పంచ్ భర్త, మాజీ డీసీసీ చైర్మన్ చిలమల నారాయణ, పలువురు రైతులు మాట్లాడుతూ ఉన్నఫలంగా మా భూములను రోడ్డు పనులకు లాక్కున్నారని... ఇప్పుడు మేం ఎలా జీవనం సాగించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.50లక్ష ల చొప్పున భూములు కోల్పోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈవిషయం తెలిసిన తహసీల్దారు దామోదర్ రెడ్డి అక్కడకు రావడంతో భూములు కోల్పోయిన రైతులు తమ ఆవేదనను వినతిపత్రం రూపంలో అందజేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిలమల లక్ష్మిదేవి, టీడీపీ నేత చిలమల నారాయణ, నాగయ్య, రైతన్నలు జయరామిరెడ్డి, సత్యనారాయణ, నరసింహయ్య యాదవ్, రామ సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ లలిత



డాక్టర్ లలితకు నియామకపత్రం అందిస్తున్న వీసీ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలితను స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. డాక్టర్ లలితకు నియామకపు పత్రాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ అందజేశారు. ప్రతినెల 3వ శనివారం వైవీయూలో స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం అమలును పర్యవేక్షించడం, నివేదించడం వంటి బాధ్యతలను చూస్తారు. కార్యక్రమంలో ప్రభుత్వం జారీ చేసిన కార్యాచరణ మార్గదర్శకాలను అమలయ్యేలా పర్యవేక్షిస్తారు. కార్యక్రమంలో ఫిజిక్స్‌శాఖ సహ ఆచార్యులు డాక్టర్ వెంకటరామ్ పాల్గొన్నారు.

తలనీలాల వేలం వాయిదా



వేలం నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో భక్తులు సమర్పించే తలనీలాల కోసం వేలం నిర్వహించగా గుత్తేదారులు ఒకరే రావడంతో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సోమవారం భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరిచిప్పలకు వేలం నిర్వహించారు. మొదటి పర్యాయం కూడా వాయిదా పడింది. రెండో పర్యాయం గుత్తేదారులు రాక వాయిదా పడింది. కొబ్బరిచిప్పలకు నలుగురు గుత్తేదారులు వచ్చినా సరైన ధర రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, బ్యాంకు అధికారులు, జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతోనే యుడైస్ విజయవంతం : డీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష, ఎమ్మార్సీ సిబ్బంది సహకారంతో యుడైస్ విజయవంతమైందని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరం సీఎస్ఐ హైస్కూల్లో యుడైస్‌పై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష ఎమ్మార్సీ సిబ్బందిలో భాగమైన మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, సీఆర్పీ (సీఆర్ఎంటీ)ల సహకారంతోనే యుడైస్‌లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. పని ఒత్తిడి ఉన్నప్పటికీ ఎంతో ఓర్పుతో తక్షణ సమాచారం ఎప్పుడు అడిగినా మండల విద్యాశాఖాధికారులు పంపుతుండడం అభినందనీయమన్నారు. ఇలా అందరి సహకారంతో విద్యాశాఖలో జిల్లా దాదాపు అన్నింటా ముందు ఉందన్నారు. నమోదయ్యే ప్రతి పాఠశాల సమగ్ర సమాచారంతోనే పాఠశాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుదని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానంద రాజులు పేర్కొన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష సెక్టోరాల్ అధికారులు వీరేంద్ర, దశరథరామిరెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల (స్కూల్ అసిస్టెంట్) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానందరాజు పేర్కొన్నారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు 19 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష కార్యాలయం, ఎన్జీఓ కాలనీ, కడపలో సమర్పించాలని తెలిపారు. పూర్తిసమాచారం వివరాల కోసం సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మూగజీవాలకు పశువైద్య విద్యార్థుల గోడు



వైద్యం కోసం వచ్చిన మూగజీవానికి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా ఉపకార వేతనాలు పెంచాలని గత 15 రోజులుగా పశువైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మెబాటపై ఎలాంటి స్పందన లభించలేదు. దీంతో తమ సమ్మెలో భాగంగా సోమవారం పశువైద్య కళాశాలకు వైద్యం కోసం తీసుకువచ్చిన మూగజీవాలకు తమ న్యాయపరమైన కోర్కెలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చి గోడును వెలుబుచ్చారు.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు శివతరుణ్ మాట్లాడుతూ గత 15 రోజులుగా స్టైఫండ్ పెంచాలన్న డిమాండ్‌తో అధికారులు, రాజకీయ నాయకులకు విన్నవించుకున్నా ఏ ఒక్కరూ స్పందించి తమకు న్యాయం చేయలేదని వాపోయారు. కనీసం మూగజీవాలకు అయినా తాము పడుతున్న బాధలు అర్థమవుతాయన్న భావనతో వినతి పత్రం అందించి నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. తదనంతరం కళాశాల ఆవరణలో సమ్మెను కొనసాగించారు.

శరవేగంగా రోడ్డు మరమ్మతులు



పొలతల దారిలో జరుగుతున్న తారు రోడ్డు పనులు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల క్షేత్రానికి వెళ్లే రహదారి మరమ్మతులు శరవేగంగా చేస్తున్నారు. మరో పది రోజుల్లో శివరాత్రి పండుగ ఉంది. రోడ్డు పనులు మందకొడిగా సాగుతున్నాయి. లక్షలాది మంది భక్తులు అధ్వానంగా ఉన్న కొండ ఘాట్ రోడ్డు, కమ్మవారిపల్లె నుంచి నీరుకోన వరకు వెళ్లే రోడ్డు పనులు నత్తనడకన చేస్తున్నారు. దీంతో 'శివరాత్రికి రోడ్డు మరమ్మతులు పూర్తయ్యేనా?' అని ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమవడంతో స్పందించిన అధికార యంత్రాంగం శరవేగంగా మరమ్మతులు చేస్తున్నారు. తారురోడ్డు వేస్తున్నారని ఈఓ కృష్ణా నాయక్ తెలిపారు.

వాహనాల్లో రావడం తగ్గించాలి

పొలతల దేవస్థానానికి స్వామి దర్శనార్థం వచ్చే భక్తులు రోడ్డు నిర్మాణపు పనులు జరుగుతున్నందున వీలైనంత వరకు వాహనాల్లో రావడం తగ్గించాలని ఆలయ ఈఓ కృష్ణా నాయక్ తెలిపారు. వాహనాల్లో రావడం వలన పనులకు ఆటంకం ఏర్పడుతోందని భక్తులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. మరో ఐదు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని తెలిపారు.

భక్తులకు అసౌకర్యం ఉండకూడదు

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజులు జరగనున్న ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని ముఖ్య శైవక్షేత్రం పొలతల మల్లి కార్జునుడని, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తారని, కావున భక్తులకు ఎలాంటి అసౌకర్య కలగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహా రెడ్డి, ఆలయ ఈఓ కృష్ణా నాయక్, శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ మాజీ చైర్మెన్ విశ్వనాథరెడ్డి, నాగమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి పాలనలో రాష్ట్రం అప్పులపాలు'

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తయినా వచ్చే ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తిచేయలేదని ఎద్దేవా చేశారు. సూపర్‌సిక్స్ మాత్రమే ఫోకస్ అయింది కానీ పథకాలు అమలు కాలేదన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు అప్పు చేసినా అవి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించేందకేనన్నారు.

పూర్వ విద్యార్థి వితరణ

పులివెందుల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం అగడూరు పాఠశాలకు పూర్వ విద్యార్థి సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రూ.10వేలు వితరణ చేశారు. సోమవారం విశ్రాంత డిగ్రీ కళాశాల లెక్చరర్ అయిన సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తాను చదివిన పాఠశాల అభివృద్ధికి తనవంతుగా రూ.10వేలు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయులు బాబు రెడ్డి, గణిత ఉపాధ్యాయుడు రాజ, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

● కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి

వివిధ కార్పొరేషన్ల నుంచి వ్యక్తిగత సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయా స్థాయిల అధికారులు ప్రకటించారు. కడప కార్పొరేషన్‌లో 19న ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలు ఉన్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం పెండ్లిమర్రి, చెన్నూరు మండలాలకు, బుధవారం ఉదయం కమలాపురం, సింహాద్రిపురం మండలాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. వివరాల్లోకెళితే....



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులకు కడప నగర పాలక సంస్థ ఆవరణలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. కమిషనర్, బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్, విద్యార్హత, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, ఒరిజినల్, రెండు సెట్లు జిరాక్స్ పత్రాలు తీసుకుని ఇంటర్వ్యూలకు రావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

పెండ్లిమర్రిలో....

పెండ్లిమర్రి,ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులు మంగళవారం ఉదయం 10.30కు కార్యాలయంలో హాజరవాలని ఎంపీడీఓ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.

చెన్నూరులో....

చెన్నూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రాయితీ రుణాల కోసం దరఖాస్తు దారులకు మంగళవారం ఉదయం 10.30కు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు తెలిపారు.

రేపు కమలాపురంలో....

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాయితీ రుణాలకు 19న మున్సిపల్ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనరు జగన్నాథ్ తెలిపారు.

రేపు సింహాద్రిపురంలో....

సింహాద్రిపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఉదయం 10-30కు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. రుణాలకు దరఖాస్తు దారులు హాజరవాలన్నారు.

రేపు పులివెందులలో....

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): సబ్సిడీ రుణాలకు 19న బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఉదయం 10.30కు స్థానిక సభాభవనంలో ఉంటాయని తెలిపారు. మున్సిపాలిటీ పరిధి పాత కౌన్సిల్ హాల్‌లో నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు.

ఉపాధి పనులను కాంట్రాక్టర్లకు ఇవ్వరాదు

● వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు జేసీకి వినతి



జేసీకి వినతి పత్రం అందిస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య తదితరులు

కడప రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధిపనులను కాంట్రాక్టర్లకు ఇవ్వరాదని వైసీపీ జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు రఘునాధరెడ్డి జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్ సభాభవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఉపాధి పనులను కాంట్రాక్టర్లకు ఇవ్వరాదన్న హైకోరు ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ఉపాధి పనులు కాంట్రాక్టర్లకు ఇవ్వడం చట్ట విరుద్ధమని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కేటాయించిన పనులను వెంటనే రద్దుచేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. చట్టం అమలులో ప్రధాన భూమిక వహిస్తున్న జిల్లా అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఎంపీపీలు చీర్ల సురేష్ యాదవ్, నారాయణరెడ్డి ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు వినతి

సింహాద్రిపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బస్టాండు సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహం, ఏర్పాటుకు తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, పంచాయతీ ఈఓ వెంకటరాముడుకు బీజేపీ నేతలు సోమవారం వినతి పత్రం అందజేశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు మండల బీజేపీ అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. బీజేపీ నేతలు పాల్గొన్నారు.

వేతన పెంపు కోసం అంగన్వాడీల ధర్నా


సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని అర్బన్, రూరల్ సీడీపీఓ ఆఫీసల్ వద్ద ధర్నాలు నిర్వహించారు. కడప అర్బన్, రూరల్ సీడీపీఓ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామమోహన్, నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా వేతనాలు పెరగకపోవడం అన్యాయమన్నారు. గతంలో 42 రోజులు సమ్మె నిర్వహించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ అమలు లేదు, గ్యాస్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాజకీయ వేధింపులతో వర్కర్స్ సతమతమవుతున్నారని తెలిపారు. ప్రమోషన్లు రాకపోవడం యాప్‌ల పేరుతో వేదనలతో, ఇబ్బందులతో వర్కర్స్ ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. కావున గత సమ్మె సందర్భంగా నెరవేరుస్తామన్న హామీలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్, రూరల్ ప్రాజెక్టుల అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

డీఆర్వోకు దళిత భూ సాధన కమిటీ వినతి


ఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న దళిత భూ సాధన కమిటీ నేతలు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేక బాడుగలు చెల్లించే స్థోమత లేక దళితులు ఇబ్బందులు పడుతున్నారని సికెదిన్నె మండలం ఊటుకూరు పొలంలో ఉండే ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలివ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడుకు దళిత భూ సాధన కమిటీ నేతలు సోమవారం వినతి పత్రం సమర్పించారు. చింతకొమ్మదిన్నె, ఊటుకూరు పొలం సర్వే నెంబరు 182/2,3-ఏ1 నుంచి 5వ లెటర్ వరకు దాదాపు 2 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆభూమిని అగ్రకులాలు కబ్జా చేయకుండా ఎస్సీ, ఎస్టీ నిరు పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని, ఆ కమిటీ అధ్యక్షుడు ఓబుళపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, అధికార ప్రతినిధి బాలయ్య, సమచార హక్కు ప్రచార కార్యదర్శి సుబ్బారావు కోరారు.

సమస్యలు త్వరగా పరిష్కరించండి

కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థ పరిధి ప్రజలు ఇచ్చే అర్జీలను సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. కడప కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 27 అర్జీలు రాగా వాటిలో ఇంజనీరింగ్‌కు 9, టౌన్‌ప్లానింగ్‌కు ఆరు, రెవెన్యూకు ఐదు, పబ్లిక్ అండ్ హెల్త్‌కు ఐదు, యూపీఏ ఒకటి, హౌసింగ్ ఒకటి అర్జీ వచ్చిందన్నారు. ఈ అర్జీలను పరిశీలించి పరిష్కరంచాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఐడీబీఐ డెస్కుల వితరణ



మాట్లాడుతున్న ఎంఈఓ గంగిరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 20వ వార్డు గాండ్లవీధి నగర పాలక ప్రాథమిక పాఠశాలకు డెస్కులను వితరణగా అందించారు. కడప ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ బ్యాంకు అందించే ఇలాంటి స్కీం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు పీవీఎస్ మూర్తి, కొవ్వూరు మస్తాన్, ప్రధానోపాధ్యాయులు యాస్మిన్ బేగం, ఐడీబీఐ కడప బ్రాంచ్ మేనేజర్ ఎం.వాసుకుమార్, సత్యనారాయణ, సతీష్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోండి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువత, విద్యార్థుల భద్రత కోసం తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్‌ను కడప తెలుగు యువత పార్లమెంటు జనరల్ సెక్రటరీ అక్కులు గారి విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం కడప కార్యాలయంలో ఎస్పీని కలిసిన ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు గురవుతున్నారని అవగాహన కార్యక్రమాలు చేపట్టి యువత మంచి మార్గంలో పయనించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ


విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ తదితరులు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కస్తూర్బా బాలికల విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డీఎస్పీ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ సమీరాభాను కంటి అద్దాలను పంపిణీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్ వాడకం గురించి, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ సమీరాభాను మాట్లాడుతూ దృష్టిలోపం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ కోసం తీసుకునే ఆహార పదార్థాల గురించి వివరించారు. సూపర్‌వైజర్ మోహన్‌రెడ్డి, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నటకళాతపస్వి సుబ్బరాజుకు డాక్టరేట్ అభినందనీయం

కడప కల్చరల్, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): కళలకు రాజు నట కళాతపస్వి ఏవీ సుబ్బరాజు కళారంగానికి చేసిన సేవలను గుర్తించి ఇంటర్‌నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ ఈనెల 9న విశాఖపట్నంలో గౌరవ డాక్టరేట్ ఇవ్వడం అభినందనీయమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. సుబ్బరాజు డాక్టరేట్ తీసుకున్న సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో ఆయనను సత్కరించారు. చిన్నతనం నుంచి సుబ్బరాజు కళల పట్ల ఆసక్తితో నటనలో నాటి కమ్మ సోదరుల వద్ద మెళుకువలు నేర్చుకున్నారన్నారు. వందలాది పౌరాణిక, చారిత్రక, సాంఘిక, నాటకాల్లో వివిధ రకాల పాత్రలు వేశారన్నారు. మరెన్నో సాంఘిక నాటకాలకు దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారన్నారు. అంతేకాకుండా ఆయన స్వయంగా సాంఘిక నాటకాలు రచించి, వాటిని స్టేజీలపై ప్రదర్శించి ప్రేక్షకుల మెప్పు పొందారని గుర్తుచేశారు. దీంతో ఆయన ప్రతిభను గుర్తించిన విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ఎంతో ముదావహమన్నారు.

మృత్యుంజయకుంట హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): నగర మృత్యుంజయకుంటలో వెలసిన మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం చేపట్టారు. జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ జి. రమణమ్మ, ఆలయ కార్య నిర్వహణాధికారి ఏ. శ్రీధర్, అర్చకులు ఎస్. సతీష్‌శశిధర్ ఆధ్వర్యంలో దాదాపు రెండు నెలలా ఇరవైరోజుల ఆదాయం లెక్కిస్తే రూ. 63,917లు కానుకల రూపంలో వచ్చినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నీటి సరఫరాలో అంతరాయం

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. లింగంపల్లె నీటి పంప్ హౌస్‌లో 19వ తేదీ బుధవారం, ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ మరమ్మతు పనులు నిర్వహించనున్నందున పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అతరాయం కలుగుతుందన్నారు. నగర పాలక సంస్థకు నీటి సరఫరా చేసే మోటార్లు పనిచేయకపోవడంతో బుధవారం సాయిపేట, బెల్లంమండి, మాసాపేట, అక్కాయపల్లె, చెమ్ముమియాపేట, విజయదుర్గాకాలనీ, లోహియానగర్ ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

ఆల్ మేవా డైరీ ఆవిష్కరణ

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ఆల్ మేవా 2025 డైరీని కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆర్. మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాస్ రెడ్డి, ఆల్ మేవా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎస్ఏఎస్ ఫరూక్ చేతుల మీదుగా ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జలీల్‌ఖాన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మైనార్టీ ఉద్యోగులందరికీ తమ ప్రభుత్వం ఎప్పటి నుంచో అండగా ఉందని, రానున్న పవిత్ర రంజాన్ మాసంలో మైనార్టీ ఉద్యోగుల కోసం కార్యాలయాల నుంచి ఒక గంట ముందు వెళ్లేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. ఉర్దూ పాఠశాలలను మూసివేస్తున్నట్టు చేస్తున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని, అది ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రగా వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు లయన్ మన్సూర్ అలీఖాన్, కార్పొరేటర్ జఫ్రుల్ల, ఆల్‌మేవా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సనావుల్లా, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నజీర్‌బాషా, రాష్ట్ర నేతలు హబీబుల్లా, ఫకృద్దీన్, ఖాజా మైనుద్దీన్, మహబూబ్‌బాషా, హుస్సేన్, గౌస్‌పీర్, హైదర్‌వలి, ఈజాజ్, ఇలియాస్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న కర్పూరి ఠాగూర్ వర్ధంతి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న, కర్పూరి ఠాగూర్ వర్ధంతిని జననాయక్ కర్పూరి ఠాగూర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు నిర్వహించారు. స్థానిక పాతరిమ్స్‌లో బీసీ. భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అవ్వారు మల్లికార్జున, బీసీ నేతలు పి.వి. రమణ, నబీకోట శ్రీనివాసులు, మునిస్వామి, ద్వారక రామస్వామి, చంద్రశేఖర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తరలింపు మానుకోవాలి

ఏడీకి ఎస్ఎఫ్ఐ వినతి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల తరలింపు ఆలోచనలను ప్రభుత్వం విడనాడాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం డీఈఓ కార్యాలయం ఏడీ మునీర్‌కు వినతిపత్రం సమర్పిచారు. కొన్నేళ్లుగా పాఠశాలలో సొంత ఊర్లోనే ఉంటూ ఎందరో విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో చదివి పైచదువుల కోసం వెళుతున్నారన్నారు. ప్రాథమిక పాఠశాలలను తరలిస్తే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు పోరాటానికి సిద్ధమవుతామన్నారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు జాలా సుమంత్, నగర నాయకులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మేనేజర్‌గా రాజశేఖర్



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ ఇన్‌చార్జి మేనేజర్‌గా ఎం.రాజశేఖర్‌ను నియమిస్తూ కమిషనర్ మనోజ్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మంగళవారం ఆయన బాధ్యతలను చేపట్టనున్నారు.

రీసర్వేకు ప్రతి రైతు సహకరించాలి

చెన్నూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియకు ప్రతి రైతు సహకరించాలని మండల సర్వేయరు సోమశేఖర్ అన్నారు. శివాలపల్లె రెవెన్యూ గ్రామంలో సోమవారం రీసర్వే నిర్వహించారు. సర్వే చేపట్టే భూముల రైతులను భూముల వద్దకే పిలిపించి వారి సమక్షంలో పక్కాగా సర్వే చేశారు. అంతేకాక రీసర్వేతో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎంతో పకడ్బందీగా సర్వే చేపట్టి రైతులకు ఆ భూమి విస్తీర్ణం, సర్వేనెంబరుతో రికార్డులు అందిస్తామన్నారు. రీసర్వే చేసేటప్పుడు ప్రతి రైతు తమ భూమి వద్దే ఉండి సర్వే చేయించుకుంటే ముప్పాతిక భాగం సమస్యలు అక్కడే తొలగిపోతాయన్నారు. వీఆర్వోలు వెంకటసుబ్బయ్య, ఆర్ఐ కౌశిక్, సర్వే డీటీ అర్చన, సచివాలయ సర్వేయర్లు ఈశ్వర్, రామచంద్ర, తేజా, సుమలత, జాకీర్‌బాషా పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

ఐదుగురికి గాయాలు

ముద్దనూరు ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ముద్దనూరు ,ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని సబ్‌స్టేషన్ సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ఐదు గురు యువకులకు గాయాలయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు వివరాలు...కడప నగరానికి చెందిన ఐదుగురు యువకులు కారులో గండికోటకు వెళుతున్నారు. సబ్ స్టేషన్ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ పి.భావన పేర్కొన్నారు. సోమవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్స్ వద్దు, ఆరోగ్యమే ముద్దు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు దేవీకుమార్, కార్యదర్శి విశ్వనాథ్, విజయకుమార్, రాఘవ, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రొద్దుటూరు / ప్రొద్దుటూరు రూరల్ ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్లకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నడింపల్లెలోని ఐసీడీఎస్ సీడీపీవో రూరల్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం స్పందించకపోతే మార్చి 10వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయకుమార్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: అంగన్వాడీ కార్యకర్తల వేతనాలు, ఇతర సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, భాగ్యమ్మ డిమాండ్ చేశారు. సోమవారం జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్, వినయ్‌కుమార్, ముంతాజ్, జ్యోతి, అలేఖ్య, హైమావతి, అపర్ణ, హసీనా, శ్రీదేవి, లక్ష్మికళ, రమ, తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద సీడీపీవో రాజేశ్వరికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

పోరుమామిళ్ల..:అంగన్వాడీటీచర్లు, హెల్పర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ అన్నారు. సోమవారం పోరుమామిళ్లలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, మేరీ, వినోదాదేవి, జ్యోతమ్మ, రేణుక, పాల్గొన్నారు.

బద్వేలు..: అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్వాడీ, మినీ అంగన్వాడీ లకు నెలకు రూ.26 వేలు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని తదితర డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవో కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, నాయకులు రాయప్ప, గౌరవాధ్యక్షురాలు సుభాషిణి, ప్రధాన కార్యదర్శి హుసేనమ్మ పాల్గొన్నారు.

ముద్దనూరు..: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కళావతి ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీడీపీవో ముంతాజ్ బేగం కు వినతిపత్రం అందించారు. అంగన్వాడీ సిబ్బంది చంద్రకళ, ప్రమీల, లక్ష్మి, హైమావతి, వరాలు పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'

జమ్మలమడుగు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని వైసీపీ కార్యకర్తలు, నాయకులు తన వెంట నడిచిన వారికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్యకర్తలతో అన్నారు. సోమవారం జమ్మలమడుగులోని ఆయన కార్యాలయం వద్దకు జమ్మలమడుగు పట్టణంలోని కార్యకర్తలను ఆహ్వానించి మాట్లాడారు. ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు నియోజకవర్గంలో జరుగనున్న విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కుళాయిబాష, రామకృష్ణ, గురివిరెడ్డి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ముద్దనూరు ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి)ప్రతి రైతు రిజిస్ట్రేషన్(విశిష్ట గుర్తింపు) చేయించుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి కొత్తపల్లి, తిమ్మాపురం రైతు సేవా కేంద్రాల్లో చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1558 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వీఏఏ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి




కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, ఆసం రఘురామి రెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, గురివిరెడ్డి, నల్లబోతులనాగరాజు, కమాల్‌బాష, అనిల్, నంద్యాల భార్గవ్‌రెడ్డి, వద్ది బాలుడు, కామిశెట్టి బాబు, వంగల నారాయణరెడ్డి, రసూల్‌గౌస్, చల్లా రాజగోపాల్, వ్యవసాయ శాఖ, మార్కెట్ యార్డ్ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి తహసీల్దారు విజిట్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వున్న భూసమస్యల పరిష్కారం కోసం ప్రతి రోజూ తహసీల్దారు మూడు గంటల పాటు గ్రామ సచివాలయానికి వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని తహసీల్దారు గంగయ్య ఓప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ప్రొద్దుటూరు మండల పరిధిలోని 18 గ్రామాలకు సంబంధించి ఫిబ్రవరి 18నుంచి మార్చి 26 వరకు ప్రతి గ్రామాన్ని విజిట్ చేస్తారు. ఫిబ్రవరి 18న ఉప్పర పల్లి, 19న కామనూరు, 20న కొతపల్లి, 21 న కల్లూరు,25న గోపవరం, 27నచౌడూరు, 28న తాళ్లమాపురం, మార్చి4 దొరసానిపల్లె, 6న నంగనూరుపల్లి, పెద్దశెట్టిపల్లె, 7న ప్రొద్దుటూరు, 13న రంగసాయిపురం, 18న మోడమీదిపల్లె, 19 ఎర్రగుంట్లపల్లి, 20న బొల్లవరం, 21న రేగులపల్లి,25న రామేశ్వరం, 26న సర్విరెడ్డిపల్లె గ్రామాలలో తహసీల్దారు పర్యటిస్తారని తెలిపారు .

రూ.3కోట్లతో అభివృద్ధి పనులకు భూమిపూజ



ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రూ.3కోట్లతో అభివృద్ధి పనులకు టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి సోమవారం ఎర్రగుంట్లనగరపంచాయతీలో భూమిపూజ నిర్వహించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.3.4కోట్లు మంజూరు అయ్యాయి. ఇందులో 10పనులు పైప్‌లైన్ నిర్మాణానికి మంజూరు చేశారు. అలాగే రూ.13లక్షలకు సివిల్ పనులు చేపట్టారు. ఏరువాకగంగమ్మ ఆలయ వీధి, వినాయకనగర్‌లలో భూపేశ్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ శేషఫణి, టీడీపీ, ఎన్‌డీయే నాయకులు, కార్యకర్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రామాలయానికి భూమి పూజ

కొండాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌ఛార్జ్ శివనారాయణరెడ్డి, ఎంపీటీసీ రామమునిరెడ్డి,మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేపు బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో 19వ తేదీ బీసీ కార్పోరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సైదున్నీసా తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతాయి. 19వ తేదీ తమ ఒరిజినల్ ఆన్‌లైన్ సర్టిఫికెట్లతో సర్టిఫికెట్లు తెచ్చుకోవాలన్నారు. ఉదయం మండలంలోని అంబవరం, వేమగుంటపల్లె, కొత్తగుంటపల్లె, దేవగుడి, గొరిగెనూరు, మోరగుడి, గూడెం చెరువు, పొన్నతోట గ్రామాల అభ్యర్థులకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి పి.బొమ్మెపల్లె, గండికోట, పి.సుగుమంచిపల్లె, సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు, సిరిగేపల్లె , ఎస్.ఉప్పలపాడు గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

● **మున్సిపాలిటీ పరిధిలో నేడు..**

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో 18వ తేదీ మంగళవారం ఉదయం జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు హాజరుకావాలని కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నవారంతా తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ ఇంటర్వ్యూలకు పట్టణ పరిధిలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు సమక్షంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

ఎర్రగుంట్ల..:సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఎంపికకు 19వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు చిలమకూరు, పోట్లదుర్తి, కలమల్ల గ్రామపంచాయతీలకు, మధ్యాహ్నం 2గంటలనుంచి 5గంటల వరకు చిననదండ్లూరు, హనుమనగుత్తి, ఇల్లూరు, కేజీవీపల్లె, కోడూరు, నిడుజువ్వి, పెద్దనపాడు, తిప్పలూరు, టి.సుంకేసుల, వలసపల్లె పంచాయతీల వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుదారులు వారికి కేటాయించిన సమయంలో హాజరుకావాలన్నారు.

బి.కోడూరు..: మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న మున్నెల్లి, ఐత్రంపేట, బి.కోడూరు, రామసముద్రం, పాయలకుంట్ల గ్రామ పంచాయతీల వారికి 19వతేదీన ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు అలాగే మేకవారిపల్లె, పెదుళ్లపల్లె, ప్రభలవీడు, తంగేడుపల్లె, తుమ్మలపల్లె గ్రామ పంచాయతీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని వారన్నారు.

చాపాడు..: మండలంలోని పలు గ్రామాలకు చెందిన నిరుద్యోగులు సబ్సిడీ బ్యాంకు రుణాల కోసం మొత్తం 387 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో వీరకిశోర్ పేర్కొన్నారు. వీరికి ఈనెల 19న బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించేందుకు తీసుకు రావాలని వారు కోరారు.

బ్రహ్మంగారిమఠం..: ప్రభుత్వం ఇటీవల అమలు చేస్తున్న బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదా రులు 19వతేదీ బుధవారం బి.మఠం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 10.30 గంటలకు హాజరు కావాలని ఎంపీడీవో వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ ఆన్‌లైన్ అప్లికేషన్, కుల,ఆదాయ ధ్రువీకరణపత్రం, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు, విద్యార్హత, ఒరిజినల్ రెండుజతల జిరాక్స్ కాపీలు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

జనావాసాల మధ్య సబ్‌స్టేషన్ నిర్మాణం తగదు



ఆందోళన చేస్తున్న ప్రజలు

ప్రొద్దుటూరు/ ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లో సబ్‌స్టేషన్ నిర్మించడం తగదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష పేర్కొన్నారు. సోమవారం శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్ వద్ద ప్రజలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల క్రితం శ్రీనివాసనగర్‌లో అప్పటి ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో నిర్మాణం పనులు నిలిచిపోయాయని తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు మళ్లీ ప్రారంభం అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసనగర్ ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల దశల వారీ పోరాటం

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల డిమాండ్ల కోసం ఫిబ్రవరి 17 నుంచి మార్చి 3 వరకు దశలవారిగా పోరాటం చేస్తామని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కార్యదర్శి మధు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో డీఈ ప్రభాకర్ దాస్ కు కార్మిక నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిండెంట్ విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపు పనుల అప్పగింత, నిర్వహణ సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని ప్రైవేటు, ఏజెన్సీలకు అప్పగించరాదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు ప్రసాద్, ప్రతాప్, డిమాండ్ చేశారు. సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని మస్టర్‌పాయింట్ వద్ద ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్, సహాయ కార్యదర్శులు మురళి, యాకోబు, దాసు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

కాశినాయన ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు అందుబాటులోఉండి పనిచేయాలని ఎంపీపీ నల్లేరు పోలమ్మ, ఎంపీడీవో మైథిలీ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఓబుళాపురం, పిట్టిగుంట గ్రామాల పరిధిలో పనిచేస్తున్న సీనియర్ లైన్‌మన్ నెలల తరబడి విధులకు డుమ్మాకొడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందని ట్రాన్స్‌కో ఏఈ దృష్టికి తెచ్చారు.కొంత మంది అధికారులు 3నెలలకు ఒకసారి జరిగే జనరల్ బాడీసమావేశానికి హాజరుకాలేని పరిస్థితుల్లో ఉన్నారని ప్రస్తుత సమావేశానికి గైర్హాజరైన మండల స్థాయి అధికారులపై కలెక్టర్‌కు నివేదిక పంపుతానని ఎంపీడీవో తెలిపారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ వెంకట సుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్,ట్రాన్స్‌కో ఏఈ రవీంద్రబాబు, ఏవో జయలక్ష్మి,ఏపీఎం ఆంజనేయులు,ఏపీవో నాగేంద్రప్రసాద్,ఎంపీటీసీలు వెకంట సుబ్బయ్యఆచారి,వంగలి గౌసియా,మాబువలి, సర్పంచ్‌లు ఖాజావలి,పిచ్చిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుభద్రమ్మ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులోని పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లిని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సోమవారం దర్శించుకొన్నారు.ఆయన పెద్దమ్మ తల్లి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం రాజీవ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయానికి వెళ్లారు. మధ్యాహ్నం రెండు చోట్లా అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబరు యాపరాల చిన్న,ఏపీ రవీంద్ర,మారుతి,ధనపాల జగన్, బండి అమర్‌నాథ్,తుపాకుల రమణ,చోక్కం శివ, భూమిరెడ్డి రమణ,బీఎన్ శ్రీనివాసులు,శీలం సతీష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి నివాళులు



పోరుమామిళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మాజీ ఎంపీపీ జింకతోటి చెన్న క్రిష్ణమ్మకు టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గిరినగర్‌కాలనీకి చెందిన మాజీ ఎంపీపీ చెన్నక్రిష్ణమ్మ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్న రాయుడు, కల్లూరి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని నివాళు లర్పించారు.

రేపు ఇంటర్వ్యూలు

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని బీసీ,కాపు కార్పొరేషన్ల అభ్యర్థులకు బుధవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ ఆఫీసులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి పత్రికా ప్రకటనలో తెలిపారు.కాపు కార్పొరేషన్‌కు 13,జనరిక్ ఫార్మసీకి 1,జనరిక్ మెడికల్ షాపునకు 1,సెల్ఫ్‌ఎంప్లాయిమెంట్‌కు 39 ,ఈడబ్ల్యూయస్‌కు 6 యూనిట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు.